


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్



చూసిన కనులదే భాగ్యమట!

చూసిన కనులదే భాగ్యమట.. అవును మరి.. ఆ స్వామిని దగ్గర చూసి భక్తజనం పరవశించి పోతున్నారు.. కన్నులారా తిలకించేందుకు భక్తజనం పోటీపడు తున్నారు.. ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చి స్వామిని వేడుకుంటున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు కనులపండువగా సాగాయి. కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వ వాహనంపై భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో విహరించారు. 9



క్యాష్ కొట్టు.. లైసెన్స్ పట్టు!

దీపావళి మామూళ్లు

- అవినీతి అధికారులకు దీపావళి
- మామూళ్లు ఇస్తేనే షాపు లైసెన్స్
- జిల్లా వ్యాప్తంగా సాగుతున్న దందా
- బ్రోకర్‌తో నడిపిస్తున్న వ్యవహారం
- 410 దుకాణాలకు దరఖాస్తులు
- ఒక్కో షాపునకు రూ.30 వేలు డిమాండ్
- గగ్గోలు పెడుతున్న తాత్కాలిక వ్యాపారులు

నిడదవోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పండగొచ్చిందంటే అధికారులకు కాసుల పంట పండాల్సిందే.. లేదంటే చేయి ఊరుకోదు..జేబు అసలే ఊరుకోదు..ఏదైనా ప్రభుత్వ పనిచేయాలంటే శాఖల్లో అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కానీ దీపావళి పండుగొచ్చిందంటే మాత్రం ప్రభుత్వ శాఖల అధికారులంతా ఒక్కటై మామూళ్ల మత్తులో తేలుతుంటారు. ఈ దీపావళికి అధికారులు బాణసంచా వ్యాపారుల నుంచి లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. బాణసంచా షాపులు ఏర్పాటుకు రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, జీఎస్టీ ప్రభుత్వ శాఖలు కలిసి తాత్కాలిక బాణసంచా లైసెన్స్ మంజూరు చేయాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 410 దరఖాస్తులు అందాయి.అయితే లైసెన్స్ మంజూరుపై అయోమయం నెలకొంది. ఎందుకంటే షాపుకో రేటు నిర్ణయించారు. ఊరికో ఆసామి (బ్రోకర్) చాలా సింపుల్‌గా ఒక్కో లైసెన్స్ దరఖాస్తుదారుడి నుంచి కొంత సొమ్ము వసూలు చేసి హోల్‌సేల్‌గా రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, జీఎస్టీ ప్రభుత్వ శాఖల అధికారులకు పంచేసి క్షణాల్లో లైసెన్స్ తెచ్చేస్తున్నాడు. ప్రభుత్వ శాఖల అధికారులు సైతం డబ్బు అందగానే నిబంధనల ఊసే మరచి అనుమతులు మంజూరు చేస్తున్నారు. సోమవారమే దీపావళి కావడంతో శనివారం నుంచే షాపులు ఆరంభించాల్సి ఉంది. అయితే శుక్రవారం రాత్రి కూడా కొన్ని షాపుల లైసెన్స్‌లపై అయోమయం నెలకొంది.ఇక షాపులు ఎప్పుడు ఏర్పాటు చేస్తారు.. బాణసంచా విక్రయాలు ఎప్పుడు చేస్తారనేది ఉన్న తాధికారులకెరుక. కొన్ని షాపులకు మాత్రం అధికారులు డబ్బులు పట్టేసి పర్మిషన్లు ఇచ్చారని బాణసంచా వ్యాపారులు కోడై కూస్తున్నారు.ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎందుకంటే 410 షాపులకు అక్షరాలా రూ.కోటిపైనే అందనున్నట్టు అంచనా.

చెల్లించాల్సింది రూ.6 వేలు..

ప్రభుత్వం నుంచి తాత్కాలిక బాణ సంచా షాపు లైసెన్స్‌కు వాస్తవానికి చెల్లించాల్సింది అగ్నిమాపక శాఖకు రూ.500 చలానా, రెవెన్యూ శాఖకు రూ.500 చలానా, జీఎస్టీ శాఖకు రూ.5 వేల అడ్వాన్స్ ట్యాక్స్ మొత్తం రూ.6 వేలు చెల్లిస్తే సరి.

చెల్లించేది రూ.30 వేలు..

రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, జీఎస్టీ ప్రభుత్వ శాఖలకు ఒక్కో బాణాసంచా దుకాణం నుంచి రూ.30 వేలు చెల్లిస్తున్నారు.
నిడదవోలులో 17 బాణసంచా షాపులకు ఒక్కో షాపునకు రూ. 30 వేల చొప్పున రూ.5.10 లక్షలు అధికారులకు అందుతోంది. ఒక్క కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని చాగల్లు, దేవరపల్లి, గోపా లపురం, కొవ్వూరు, నల్లజర్ల, పెరవలి, తాళ్ళపూడి, ఉండ్రాజవరం, నిడదవోలులో ఏర్పాటు చేస్తున్న 111 షాపులకు రూ.33.30 లక్షలు దీపావళి బాణసంచా షాపుల లైసెన్స్ దారుల నుంచి అధికారులకు చేతులు మారాయని వ్యాపారులు వాపోతున్నారు.



కుతుకులూరులో పట్టుబడిన బాణసంచా

వైసీపీ కార్యాలయంలో బాణసంచా సీజ్

అనపర్తి,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం కుతుకులూరు వైసీపీ కార్యాలయం లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టు బడింది. వైసీపీ నాయకుడు, కుతుకులూరు ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి ఇంట్లో వైసీపీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.ఈ కార్యాలయంలో అక్రమంగా బాణసంచా నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో అనపర్తి ఎస్‌ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు.దీంతో కార్యాలయంలో ఉంచిన బాణసంచా నిల్వలు బయటపడ్డాయి.ఈ మేరకు సీఐ సుమంత్ అక్కడికి చేరుకుని అక్రమ నిల్వలను పరిశీలించారు.ఎస్‌ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ బాణసంచా అక్రమ నిల్వలపై సబ్బెళ్ళ నాగిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.బాణసంచా విలువ సుమారు రూ.1 లక్ష వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఎస్‌ఐ సుజాత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ బాణసంచా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

చాగల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చాగల్లు శివారు చిక్కాలకు వెళ్లే రోడ్డుకు సమీపంలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న కేంద్రంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. రాజమహేంద్రవరం నార్త్‌జోన్ ఏసీపీ, కొవ్వూరు ఇన్‌చార్జి డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు మట్టా శివన్నారాయణకు చెందిన జీడిమామిడి తోటలో దాడి చేయగా భారీ ఎత్తున బాణసంచా తయారీకి ఉపయోగించే బొగ్గు, సూరేకారం, గంధకం, తదితర సామగ్రిని మొత్తం 2,525 కేజీలు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అతుకూరి వేణుగోపాలకృష్ణ, మట్టా శివన్నారాయణ, దొనక మురళి, పల్లెల రవికుమార్, కోకనాటి సూరిబాబులను అరెస్టు చేశారు. పండూరి అన్నవరం పరారీలో ఉన్నట్టు తెలిపారు. ముడి సరుకు వివరాలు తెలుసుకుని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గతేడాది కంటే ఎక్కువ ధాన్యం సేకరిస్తాం

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గతేడాది కన్నా 50 లక్షల మెట్రిక్ టన్నుల అధిక ధాన్యాన్ని సేకరించాలన్న లక్ష్యంతో పని చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం డి.ముప్పవరంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యం సేక రించిన 24 గంటల్లోనే వారి ఖాతాలోకి సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ ఏడాది కూడా తూచ తప్పకుండా ఇదే విధానం అమలు చేస్తామన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జేసీ వై.మేఘ స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత,మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు జీఎస్టీ తగ్గింపుపై విద్యుత్ వస్తువుల ఎక్స్‌పో

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్‌సేవింగ్స్ నినాదంతో రాజమహేంద్రవరం త్యాగరాజ భవనంలో శనివారం జీఎస్టీ తగ్గింపును వివరిస్తూ ఎలక్ట్రికల్ వస్తువుల మెగా ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ కె.తిలక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎక్స్‌పో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉంటుందన్నారు. ఇందులో లైట్స్, ఏసీలు, ఫ్రిడ్జిలు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, వాటర్ హీటర్లు, గీజర్లు, వాషింగ్ మిషన్లు ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపటి వరకూ జీఎస్టీ షాపింగ్ ఉత్సవ్

జాయింట్ కమిషనర్ సుధాకర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్ ఆదివారం వరకూ నిర్వహిస్తామని స్టేట్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.సుధాకర్ తెలిపారు. ఆనంద్ రీజెన్సి పందిరి పంక్షన్ హాల్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి మాట్లాడారు. ఈ వారాంతంలో ప్రతి ఒక్కరూ షాపింగ్ ఉత్సవ్‌ను సందర్శించి లక్కీడిప్‌లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ శాఖ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సాయిరామ్, ఆల్కట్ గార్డెన్ అసిస్టెంట్ కమిషనర్ ఏవి శ్రీనివాస్, జీఎస్టీ ఆఫీసర్ హుస్సేన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ 18 మందికి ఫైన్

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధించిందన్నారు. 23 కేసుల్లోని 18 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఐదుగురికి ఒక్క రోజు జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య తీర్పు ఇచ్చారన్నారు.

జిల్లాలో 33 బ్లాక్ స్పాట్‌లు గుర్తింపు

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. పెరవలి, రాజానగరం గామన్ వంతెన, నల్లజర్ల ప్రాంతాల్లో ప్రమాదాల సంఖ్య అధికమన్నారు. రాజానగరం- కాకినాడ ఏడీబీ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 33 బ్లాక్ స్పాట్లు ఉన్నాయని తెలిపారు. వాటి వద్ద లైటింగ్, సైన్ బోర్డులు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమన్నారు. పోలీస్, రవాణా, ఆర్ అండ్‌బీ,రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తక్షణమే తనిఖీలు నిర్వహించి భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. రాజమహేంద్రవరంలో రాత్రి వేళల్లో సరిపడా వెలుతురు లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అవసరమైన చోట్ల వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. హైవేల్లోని డివైడర్ల మధ్య నుంచి అటూఇటూ దాటకుండా ఖాళీలను మూసివేయాలని ఎన్‌హెచ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై పరిమితికి మించిన వేగంతో వెళుతున్న వాహనాల వివరాలను ఎన్‌హెచ్ అథారిటీ వాళ్లు పోలీస్ శాఖకు అందజేస్తే చలానాలు జారీ చేస్తామన్నారు. నగర రహదారుల్లో అక్రమణల తొలగింపునకు త్వరలో చర్యలు చేపడతామన్నారు.

మాదకద్రవ్యాలపై డయల్ 1972

గంజాయి తదితర నిషేధిత మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో చైతన్యం తేవాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. జిల్లాను పూర్తిగా గంజాయి రహితంగా తీర్చిదిద్దడానికి అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. పోలీస్, ఎక్సయిజ్ అధికారులు తమ పరిధిలోని సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా మంచి ఫలి తాలను సాధించవచ్చని చెప్పారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ గత జూన్ నుంచి ఇప్పటి వరకూ జిల్లా పోలీసులు, ఈగల్ టీమ్స్ సుమారు 3500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నా రన్నారు. 93 మంది నిందితులపై 23 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గోకవరం,కోరుకొండ, సీతానగరం ప్రాంతాల్లో గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిపై నిఘా పటిష్టం చేశామన్నారు. జిల్లాలో 22 హాట్‌స్పాట్‌లను గుర్తించి నిరంతరం తనిఖీలు చేసే ఏర్పాట్లు చేశామన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల సమా చారాన్ని 1972 నెంబరుకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, డీపీఆర్వో లక్ష్మీ నారాయణ, ఈఎస్ లావణ్య పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షలో కలెక్టర్ కీర్తి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, చిత్రంలో ఎస్పీ, జేసీ, కమిషనర్

మందుబాబులు



- ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్
- ఇక నకిలీ మద్యానికి చెక్
- క్యూఆర్ కోడ్‌తో బాటిల్ చిట్టా
- నకిలీపై ఫిర్యాదు చేయవచ్చు
- నాణ్యతపై కూటమి ఛాన్స్

సురక్షితం!

స్కాన్ చెయ్.. నకిలీ పట్టేయ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యాన్ని పారించారు. మందుబాబుల జేబులు, ఆరోగ్యాలకు చిల్లు పెట్టారు.అయితే కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని ఆసాంతం మార్చేసింది. నాణ్యమైన సరుకు, బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. ధరలను తగ్గించింది. మందుబాబులకు నిజం తెలియడం ప్రధానమనే ఉద్దేశంతో ప్రభుత్వం సురక్ష ఏపీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ అనే యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మద్యం తయారీ వివరాలు పక్కాగా తెలుసుకోవచ్చు. ఒకవేళ నకిలీ అయితే ఇట్టే పట్టేస్తుంది. ఆపై ఎక్సయిజ్ అధికారులు ఆ తయారీ, విక్రయదారుల పనిపడతారు.యాప్‌పై ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఇప్పుడు సురక్ష యాప్

నకిలీ మద్యం తయారీ, విక్రయాలు లేకపో యినా..ఒకవేళ ఎక్కడైనా చాటుమాటుగా అధికారుల కళ్లుగప్పి చేస్తున్నా వారి పనిపట్టడానికి ఏపీ ఎక్సయిజ్ సురక్ష యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.దీంతో నాణ్యతపై ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. యాప్ ద్వారా సుల భంగా తెలుసుకోవచ్చు.ఎక్కడ, ఏ పరిమా ణంలో, ఏ బ్రాండ్ మద్యం కొనుగోలు చేసినా వినియోగదారుడు తక్కున ఆ బాటిల్‌లో మద్యం వివరాలు తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి సురక్ష యాప్ ఏపీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌లో ఉండే క్యూఆర్ కోడ్ స్కానర్‌తో బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే బ్రాండ్ పేరు, లైసెన్స్, తయారీ స్థలం తదితర వివరాలు వస్తాయి. ఒకవేళ మద్యం నకిలీ అయితే చట్టబద్ధమైన హెచ్చరిక మెసేజ్ వస్తుంది.అలాగే 'డిటెయిల్స్ నాట్ ఫౌండ్' అని వచ్చినా నకిలీ మద్యమనే అర్థం చేసుకోవాలి. యాప్‌లోని సమాచారం రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుంది. వినియోగదారుడు ఎక్సయిజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

వైసీపీ హయాంలో ..

వైసీపీ ప్రభుత్వం ఎక్సయిజ్ శాఖను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. నాసిరకం మద్యాన్ని ఐదేళ్లు పారించడానికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ-సెబ్) అంటూ ఓ కొత్త విభాగాన్ని సృష్టించారు. మద్యం అమ్మకాలు, అక్రమాలపై అసలు నిఘా, తనిఖీలు, చర్యలు లేకుండా చేశారు. నాసిరకం మద్యాన్ని అధిక రేట్లతో తాగించారు. సొంత తయారీ మద్యాన్ని తాగించడానికి బ్రాండెడ్ మద్యాన్ని రాకుండా చేశారు. ఎంసీ వంటి అంతర్జాతీయ కంపెనీలు సైతం రాష్ట్రానికి ఐదేళ్లు రాలేదు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ అన్ని బ్రాండ్లు రాష్ట్రంలో అడుగుపెట్టాయి. ఇప్పుడు నాణ్యమైన సరుకు దొరుకుతున్నా..నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అంటూ వైసీపీ నాయకులు యాగీ చేస్తున్నారు.

కూటమి వచ్చాక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ పిచ్చి బ్రాండ్ల తయారీకి అడ్డుకట్ట వేశారు.తమిళనాడు, కర్నాటక, కేరళ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని మద్యం పాలసీపై ఉన్నతాధికారులతో అధ్యయనం చేయించారు. కమిటీ నివేదిక ఆధారంగా కొత్త పాలసీ వచ్చింది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రైవేటు షాపులు, పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్, ఖాసా డిస్టలరీస్ కంపెనీ, పీరి డిస్టలరీస్ లిమిటెడ్ వంటి కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. నాణ్యమైన బ్రాండ్లు సరసమైన ధరలతో అందుబాటులోకి వచ్చాయి.ప్రస్తుతం 200 వరకూ బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరిలో 400 వరకూ ప్రైవేటు మద్యం దుకా ణాలు, 30 బార్లు ఉన్నాయి. నెలకు రూ.300 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి.

సురక్షా యాప్‌తో సులభంగా



సురక్షా-ఏపీ ఎక్సయిజ్ యాప్‌తో మద్యం నాణ్యత సులభంగా తెలుసుకోవచ్చు.నకిలీ మద్యం తయారీ, విక్రయాలు లేవు. ఎప్ప టికప్పుడు మద్యం దుకాణాలు,బార్లు తనిఖీలు చేసి నమూనాలను ల్యాబ్‌లకు పంపిస్తున్నాం. ఇప్పటి వరకూ నకిలీ ఆనవాళ్లు లభ్యం కాలేదు.నిరంతర నిఘాతో పాటు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. అక్రమ మద్యం, సారా సమాచారాన్ని ఎక్సయిజ్ అధికారులకు చేరవేస్తే వివరాలు గోప్యత పాటిస్తాం.

- లావణ్య, ఎక్సయిజ్ సూపరింటెండెంట్

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శకద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శా తం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"'తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. డైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

జల్ సంచాయ్‌జన్ భాగీధారిలో ఆర్ఎంసీకి
జాతీయ స్థాయిలో నాలుగో స్థానం



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. నీటి సంరక్షణ చర్యలకు గాను దేశంలో నాలుగోవ స్థానాన్ని రాజమహేంద్రవరం కైవశం చేసుకుంది. దేశంలో 2024-25గా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జలసంచాయ్ జన భాగిదారి (జేఎస్‌జేబీ) 1.0 ర్యాంకింగ్స్ ప్రకారం దేశవ్యాప్తంగా చేపట్టిన నీటి సంరక్షణ పనుల్లో రాజమహేంద్రవరం నగరం ఈ ఘనత సాధించింది. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో ఛత్తీస్‌ఘడ్ రాయ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిలిచింది. రెండో స్థానంలో తెలంగాణ నుంచి గ్రేటర్ హైదరాబాద్ సాధించింది. మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్ నుంచి గోరఖ్‌పూర్ కార్పొరేషన్ నిలిచింది. నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్ నుంచి రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ నిలిచింది. ఈ అవార్డుతో పాటు రూ.2 కోట్లు నగదు బహుమతి కూడా రాజమహేంద్రవరం కైవసం చేసుకుంది. అ అవార్డును వచ్చేనెల 18న నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అందుకోనున్నారు. నగరం వ్యాప్తంగా 13,298 నీటి సంరక్షణ పనులు చేపట్టినట్టు కేంద్ర బృందం పర్యటనలో ఫొటోలతోపాటు అప్లోడ్ చేశారు. జాతీయనీటీ కమిషన్ ఈ బృందం జూన్‌లో ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం వచ్చి పర్యటించింది. అప్పుడు నగరంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సీవేజ్ ట్రీ ట్మెంట్ ప్లాంట్, కంబాలచెరువు, ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాయాలల్లో ఇంకుడు గుంతలు పరిశీలించారు. వర్షపు నీటిని వడిసిపట్టడం, నీటిని నిల్వ చేయడం, పొదుపు చేయడం వంటి వాటిని ప్రామాణికంగా తీసుకుని ఈ ర్యాకింగ్‌ను జాతీయ జల్‌శక్తి శాఖ రాజమహేంద్రవరానికి నాలుగో స్థానం ఇచ్చింది. జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్ రావడం పట్ల కమిషనర్ రాహుల్ మీనా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనతలో కీలక పాత్ర పోషించిన అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భూగర్భ జలాల పెంపుదల, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించడం, ప్రజల భాగస్వామ్యం అనే ఈ మూడు ప్రధాన లక్షాలతో ఈ విజయం సాధ్యమైందని మునిసిపల్ కమిషనర్ అన్నారు.

సామర్లకోటలో బాలుడి కిడ్నాప్

» 24 గంటల్లో ఛేదించిన పోలీసులు » క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

సామర్లకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు ఏడీబీ రోడ్డులోని మట్టపల్లి వారి చెరువు మైదాన ప్రాంతానికి చెందిన గుడారాలలో నివసిస్తున్న సంచారజీవులకు చెందిన ఐదేళ్ల బాలుడు గురువారం రాత్రి కిడ్నాప్‌కు గురయ్యాడు. అప్పటివరకూ తమ చెంతనే నిద్రించిన తమ కుమారుడిని ఎవరో అపహరించుకుపోయారని సామర్లకోట పోలీసులకు దేవర కోటేష్ ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం బాలుడిని టిడ్కో కాలనీలో ఒక ఇంటిలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సీ-9 బ్లాక్, ఎస్ఎఫ్-6కు చెంది కేతినీడి దేవి, ఆమె భర్త వీరబాబు కలిసి బాలుడిని కిడ్నాప్ చేసినట్టు పోలీసులు నిర్ధారించి వారిద్దరినీ అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బాలుడిని శుక్రవారం రాత్రి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా కేతినీడి దేవి గతంలో సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోరీల్లో కేసుల్లో నిందితురాలిగా ఉన్నట్టు సీఐ కృష్ణభగవాన్ పేర్కొన్నారు.

రాష్ట్ర చిత్రలేఖనం పోటీల్లో కళ్యాణికి తృతీయస్థానం



సీఎం చంద్రబాబు నుంచి బహుమతి అందుకుంటున్న యజ్ఞకళ్యాణి

మండపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మండపేట మున్సిపల్ గౌతమి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న చల్లా యజ్ఞకళ్యాణి వేసిన చిత్రానికి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం దక్కిందని ప్రధానోపాధ్యాయుడు దంటు శ్రీను తెలిపారు. జిల్లాలో ప్రథమస్థానం దక్కించుకోగా రాష్ట్రస్థాయిలో తృతీయస్థానంలో కైవశం చేసుకున్నట్టు చెప్పారు. అమరావతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నుంచి కళ్యాణి అవార్డు అందుకుందన్నారు. రాష్ట్రస్థాయిలో 13మంది విద్యార్థులు జీఎస్టీ 2.0పై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థికి అవార్డు దక్కడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రామ్‌గోపాల్ వర్మపై
దేశద్రోహి కేసు పెట్టాలి
రాజమండ్రి త్రీటౌన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై దేశద్రోహి కేసు నమోదు చేయాలని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామాజిక విద్వేషాలకు ఆజ్యం పోస్తున్న యాంకర్ స్వప్న, వాటిని ప్రసారం చేస్తున్న ఛానల్ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామ్‌గోపాల్ వర్మ ఆగడాలు రోజురోజుకూ శ్రుతి మించిపోతున్నాయని ఆరోపించారు. హిందూ దేవుళ్లపై అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో మాట్లాడుతూ మత సామరస్యానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఆర్జీవీ వ్యాఖ్యలు యువత జీవితాలకు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వాటిని స్వప్న మరింత రెచ్చగొడుతోందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపారు.

24 మందికి రూ.2.52 లక్షల ఫైన్

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు, అంగర, మండపేట, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 24 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.10,500 చొప్పున జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ తీర్పు చెప్పారు.

వైభవంగా శాంతి కల్యాణం



శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

108 కలశాలతో స్నపన తిరుమంజన సేవ
ముగిసిన బాలబాలాజీ పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీతీరంలో వేంచేసి ఉన్న అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం మూడో రోజు ఉభయ దేవేరులతో అలంకరించిన పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి చక్రపెరుమాళ్‌కు సమర్పించారు. 108 కలశాలతో స్వామి-అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం పవిత్ర అవరోహం, మహాపూర్ణాహుతి, శ్రీవారికి ఏకాదశ ఫలరస స్నపన తిరుమంజన సేవను ఘనంగా చేశారు. లోకకల్యాణార్థం శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహించారు. చతుష్టానార్చనలతో ప్రారంభించిన ఈ పవిత్రోత్సవాలు శ్రీపుష్పయాగం, రుత్విక్ సన్మానంతో ముగిశాయి. శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల కృష్ణమాచార్యులు, ఆలయా ర్చకులు ఆధ్వర్యంలో సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఉత్సవాలను భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఏసీ సత్యనారాయణ

నిన్న రూ.1500.. నేడు రూ.800

● అధిక సంఖ్యలో యానాం మార్కెట్‌కు చీరమేను ● సగానికి సగం తగ్గిన ధర



యానాం పుష్కర్‌ఘాట్ వద్ద చీరమేను కోసం మాంసాహార ప్రియులు

యానాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో శనివారం చీరమేను అమ్మకాలు, కొనుగోళ్లతో జాతరను తలపించింది. తూర్పుగాలుల సమయంలో ఈ చీరమేను మత్స్యకారులకు దొరుకుతుంది. తూర్పుగాలుల సయయంలో నీటి అడుగు భాగం నుంచి ఉపరితలం(నీటిపైకి)మీదకు చేరుతుంది. యానాంలో శనివారం అధిక సంఖ్యలో చీరమేను దొరకడంతో మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించింది. ఒక్క రోజే సుమారు రూ.20 లక్షల మేర వ్యాపారం జరిగింది. ఉదయం నుంచి అధికసంఖ్యలో మార్కెట్‌కు చీరమేను రావడంతో రాజీవ్ బీచ్‌లోని పుష్కర్‌ఘాట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. బకెట్టు, బిందుల్లో చీరమేను యానాం పుష్కరఘాట్ వద్ద గల మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. రెండు రోజుల క్రితం సేరు(1లీటరు) రూ.1500 నుంచి రూ.1600 వరకు అమ్మడైతే శనివారం రూ.750 నుంచి 800వరకు విక్రయించారు. ధర తగ్గిందని తెలియడంతో మాంసాహార ప్రియులు బకెట్లను హాట్‌కేక్‌లగా కొనుగోలు చేసి పట్టుకునిపోయారు, మరో రెండు రోజులపాటు ఇదే కొనసాగితే ధర రూ.500 వరకు వచ్చే అవకాశం ఉంది.



జాతీయ కబడ్డీ పోటీలకు ప్రియాంక ఎంపిక



ప్రియాంకను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని కబడ్డీ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో గొల్లలమామిడాడలో నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర రాష్ట్ర కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో తమ కళాశాలలో బీఎస్సీ సెకండియర్ విద్యార్థిని ఎల్.ప్రియాంక కనబరిచి 2025-26కు గాను సౌత్‌జోన్ ఉమెన్ ఇంటర్ కాలేజి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని వైస్ ప్రిన్సిపాల్ ప్రభల శ్రీవల్లి, వై.సుధారాణి, ఎ.నాగు తదితరులు అభినందించారు.


రోడ్డు ప్రమాదంలో
ర్యాలి యువకుడి మృతి

కడియం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కడియం మండలం వెంకయ్యపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ర్యాలికి చెందిన బందెల రామాంజనేయులు(23)ని ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన మహేష్ మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని ఓ శుభకార్యానికి తీసుకెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా రావులపాలెం వైపు వెళుతున్న లారీని ఢీకొనడంతో రామాంజనేయులు దుర్మరణం పాలయ్యాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.ధనలక్ష్మిప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద ముంపులోనే
గండిపోశమ్మ ఆలయం



దేవీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వయంభువుగా వెలిసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం వరదనీటిలో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలో గోదావరి నది పొంగి ప్రవహించడంతో వరదనీరు చేరి అప్పటి నుంచి ఆలయం వదరలోనే ఉండిపోయింది. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికీ కాఫర్‌డ్యాం బాక్ వాటర్ కారణంగా ఆలయాన్ని వరద వీడలేదు. మరో వారం రోజుల్లో ఆలయ పరిసరాల్లో వరద తగ్గుముఖం పట్టే అవకాశముందని స్థానికులు తెలిపారు.


కల్పవృక్ష వాహన సేవను తిలకిస్తున్న భక్తులు

- భక్తులను కటాక్షించిన వాడపల్లివాసుడు
- శోభాయాత్రగా గోదావరి నదీ జల సంగ్రహణ
- ఘనంగా లక్ష కుంకుమార్చన
- శాస్త్రోక్తంగా చూర్ణోత్సవం
- కల్కి అలంకరణలో అశ్వ వాహనంపై విహరించిన శ్రీవారు
- వాడపల్లిలో 8వ రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు

కల్పవృక్షంపై దేవదేవుడు

ఆత్రేయపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం 9.15 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన కనుల పండువగా నిర్వహించారు. అనంతరం మేళతాళ, మంగళవాయిద్యాలతో శోభాయాత్రగా గౌతమి గోదావరి వద్దకు వెళ్లి వేదమంత్రాలతో గోదారమ్మకు పూజలు నిర్వహించి నదీ జలసంగ్రహణ జరిపారు. గోదావరి జలాలను తీసుకువచ్చి మహా స్నపనం గావించారు. లక్ష కుంకుమార్చన, ప్రధాన హోమాలు నిర్వహించారు. శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి అశేష భక్తజనం నడుమ కల్పవృక్ష వాహనంపై విహరించారు. సాయంత్రం యాగశాలలో హోమాలు, శ్రీమహాలక్ష్మి మంత్రపూర్వక మహాలక్ష్మి హోమం, నీరాజన మంత్రపుష్పం జరిపారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు రంగులు చిమ్ముతూ చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి 7.01 గంటలకు కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వ వాహనంపై అధిరోహించి విద్యుత్ కాంతులు, మేళతాళ మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో విహరించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జాయింట్ కలెక్టర్ నిషాంతి, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


గోదావరి జలాలను తీసుకువస్తున్న అర్చకస్వాములు


వసంత మండపంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యం


చూర్ణోత్సవంలో సందడి చేస్తున్న ఈవో, సిబ్బంది


అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌కి వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకస్వాములు


జాయింట్ కలెక్టర్ నిషాంతికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో


రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఉప కమిషనరు సూర్యచక్రధరరావు

భక్తిశ్రద్ధలతో సత్యదీక్షల స్వీకరణ


సత్యదీక్షలు స్వీకరించి పూజల్లో పాల్గొన్న దీక్షాపరులు

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధి శుక్రవారం పసుపుదళంతో శోభసంతరించుకుంది. స్వామివారికి అత్యంత ఇష్టమైన సత్యదీక్షలు స్వీకరించే ప్రత్యేకరోజు కావడంతో అధికసంఖ్యలో భక్తులు సత్యదీక్షలు స్వీకరించారు. అన్నవరం పరిసర ప్రాంతాలు వివిధ ప్రాంతాల్లో సుమారు 3వేలమంది సత్యదీక్షలు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. ప్రతీఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే మఖనక్షత్రం రోజున ఈ దీక్షలు స్వీకరించి కార్తీక మాసంలో వచ్చే మఖ నక్షత్రంతో సత్యదీక్షావిరమణ జరుగుతుంది. రత్నగిరిపై స్వామివారి వార్షిక కల్యాణమండపంలో దీక్షాపరులు గురుస్వాములు, అర్చకస్వాములు చేతులమీదుగా దీక్షలు స్వీకరించారు. సత్యదీక్షల ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో జగ్గంపేట, ఏలేశ్వరం, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలలలో సుమారు వెయ్యిమంది సత్యదీక్షలు స్వీకరించారు.

సత్యదేవుడికి జన్మనక్షత్రపూజలు

స్వామి జన్మనక్షత్రం మఖ సందర్భంగా ప్రధానాలయంలో మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింప చేశారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం పట్టువస్త్రాలను ధరింపచేశారు. ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా చండీహోమం

రత్నగిర క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు గణపతిపూజతో అర్చకస్వాములు కార్యక్రమం ప్రారంబించారు. అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతిగా వించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా వ్రతాల నిర్వహణ

1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా : అన్నవరం దేవస్థానం ఈవో

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి ప్రారంభంకానున్న కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకునేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్రతాల నిర్వహణ చేపట్టాలని ఈవో వీర్ల సుబ్బారావు వ్రతపురోహితులను కోరారు. శుక్రవారం వ్రతపురోహితులతో సమావేశమయ్యారు. భక్తుల సందేహాలను విసుగుచెందకుండా నివృత్తి చేయాలని, పర్వదినాలలో దేవస్థానం అందించే సర్క్యులర్‌కు అనుగుణంగా విధులకు పూర్తిగా హాజరుకావాలని, ఆలయఖ్యాతి ఇనుమడింపచేసే విధంగా వ్రతపురోహితులు వ్యవహరించాలని పేర్కొన్నారు. వ్రతపురోహితులకు ఏమైనా సమస్యలుంటే తనవద్దకు తీసుకురావాలని పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ ఏడాది సుమారు 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. సమావేశంలో కల్యాణబ్రహ్మచామర్తి కన్నబాబు, వ్రతపురోహిత సూపర్‌వైజర్లు వ్రతపురోహిత సంఘ నాయకులు మెకరాల రాజేష్, మల్లాది గురుమూర్తి వ్రత విభాగ అధికారులు ఉన్నారు.


వ్రతపురోహితుల సమావేశంలో పాల్గొన్న ఈవో, వ్రతవిభాగ అధికారులు

సత్యదేవుడికి గవర కార్పొరేషన్ చైర్మన్ పూజలు


వేదాశీర్వచనం పొందుతున్న రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం రాష్ట్ర గవర కర్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

24న తెలుగు వర్శిటీ వీసీ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్‌గా నియమితులైన డి.మునిరత్నం నాయుడు ఈనెల 24న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈనెల 22నే రాజమహేంద్రవరం వచ్చే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లా దిగుమూర్తివారిపల్లెకు చెందిన నాయుడు 1987 నుంచి 2017 వరకూ ఉమ్మడి తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రాచీన తెలుగు కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఇన్‌చార్జిగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుకున్న నాయుడు శుక్రవారం విజయవాడలో పెద్దలను కలిశారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావడమే తన కర్తవ్యంగా పనిచేస్తానని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ బదిలీ

రాజమహేంద్రవరం (ధవళేశ్వరం)లోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు(పీఐపీ) భూసేకరణ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్‌జీసీ సత్తెనపల్లి సరళావందనం బదిలీ అయ్యారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి నేరుగా రిపోర్టు చేయవలసిందిగా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశించారు. ఆమె స్థానంలో ఎవర్నీ నియమించలేదు.

కల్తీ టిఫిన్ తిని 20 మందికి అస్వస్థత

ఆలస్యంగా వెలుగులోకి..


అంబాజీపేటలో చికిత్స పొందుతున్న బాధితులు

అంబాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన 20 మంది కల్తీ అల్పాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. బుధవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరంతా అంబాజీపేటలో ఉన్న హోటల్‌లో బుధవారం ఉదయం టిఫిన్ తిని అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్‌పాయిజన్ కావడంతో అంబాజీపేట, అమలాపురంలోని పలు ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మాచవరం గ్రామ పరిధిలోని బెహరవారి అగ్రహారం, అంబేద్కర్‌నగర్లకు చెందిన 20 మంది స్థానికంగా ఉన్న ఓ బెల్లం తయారీ కేంద్రం, భవన నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లారు. అంబాజీపేటలోని ఓ హోటల్ నుంచి బుధవారం ఉదయం తీసుకువచ్చిన టిఫిన్ తిని అస్వస్థతకు గురయ్యారు. స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స తీసుకున్నారు. అయినప్పటికి వీరోచనాలు, వాంతులు తగ్గకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రవేట్ ఆసుపత్రుల్లో చేరారు. ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న వారిని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐలు చిరంజీవి, శివకృష్ణ పరామర్శించి వివరాలు సేకరించారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

శంఖవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోడ రాంబాబు (75) అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబు సీతంపేట నుంచి కత్తిపూడి వైపు వెళ్తుండగా అదేదిశగా వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు, పోలీసులు వెంబడించి ఆపివేశారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దర్యాప్తు మొదలు..

- రాయవరంలో బాణసంచా పేలుడు ఘటనా స్థలాన్ని పరిశీలించిన ద్విసభ్య కమిటీ బృందం
- ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తరువాత పరిశీలించి న్యాయం చేస్తాం
- పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఐజీ రవికృష్ణల బృందం
- బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందిస్తాం : సురేష్‌కుమార్ వెల్లడి
- ఘటనాస్థలంలో ఆద్యంతం పరిశీలన.. ఆధారాలు గుర్తింపు
- పర్యటనలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా


స్థానిక అధికారులతో మాట్లాడుతున్న దిసభ్య కమిటీ సభ్యుల బృందం

అమలాపురం, మండపేట/రాయవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఈనెల 8వ తేదీన బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద ఘటనపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు ద్విసభ్య కమిటీ సభ్యులు స్పష్టంచేశారు. రాయవరంలోని లక్ష్మీ గణపతి ఫైర్‌వర్క్సులో బాణసంచా తయారీకేంద్రంలో జరిగిన భారీ విస్ఫోటనంలో మొత్తం పది మంది మృత్యువాతపడ్డారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ప్రభుత్వం విచారణకు ఆదేశించి ద్విసభ్య కమిటీని నియమించింది. శుక్రవారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్కే. రవికృష్ణతో కూడిన ద్విసభ్య కమిటీ బృందం పేలుడు జరిగిన శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్సును ఆద్యంతం పరిశీలించారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన తరువాత స్థానిక నిర్వాహకులు, అధికారులను విచారించారు. రాయవరం ప్రాంతీయ రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మికశాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ద్విసభ్య కమిటీ సభ్యులు సమగ్రంగా విచారణ చేపట్టారు. అనంతరం రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక మీడియాతో వీరు మాట్లాడారు. ఫోరెన్సిక్ నివేదిక రా గానే ఘటన పూర్తి వివరాలు తెలుస్తాయి. అలాగే ప్రమాదంలో మరణించిన పది మంది కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు స్పష్టంచేశారు. ప్రమాదానికి గల కారణాలు, ఘటన జరిగిన వెంటనే నిర్వహించిన ప్రాథమిక విచారణ నివేదికలను పరిశీలించామని వెల్లడించారు. స్థానిక అధికారులు బాణసంచా తయారీ కేంద్రం వద్ద సంబంధిత భద్రతా ప్రమాణాలు, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశంపై సంయుక్త తనిఖీలు జరిపి తగిన లైసెన్సులు, నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ)లను సెప్టెంబరు నెలలోనే జారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అయితే బాణసంచా తయారీ ప్రక్రియలో భద్రతా నిబంధనలు పూర్తిగా పాటించారా లేదా అన్న విషయంలో కొన్ని అనుమానాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఘటన సమయంలోను, ఆ తరువాత నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ద్విసభ్య కమిటీ సభ్యులైన సురేష్‌కుమార్, రవికృష్ణకు వివరించారు. ఘటనా స్థలంలో అణువణువునా పరిశీలన చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి పార్థసారథి, ఆర్డీవో డి.అఖిల, తహశీల్దార్ బి.భాస్కర్, కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, పోలీసు సిబ్బంది ఉన్నారు. కాగా ద్విసభ్య కమిటీ పరిశీలన సమయంలో మీడియాతోపాటు ప్రజా సంఘాల ప్రతినిధులను కూడా దూరంగా ఉంచారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకుంటామని ద్విసభ్య కమిటీ సభ్యులు ఇచ్చిన హామీతో బాధితుల్లో ఒకింత చల్లబడ్డారు. సాయంత్రం 4 గంటల వరకు కమిటీ సభ్యులు అక్కడే ఉండి ఘటనకు దారితీసిన పరిస్థితులపై వివిధ కోణాల్లో విచారణ చేశారు.

మరో బాణసంచా కేంద్రం పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం రాయవరం సంఘటనపై నియమించిన ప్రత్యేక అధికారుల బృందం పేలుడు ప్రదేశానికి సమీపంలో ఉన్న మరో బాణసంచా తయారీ కేంద్రం భవానీ ఫైర్‌వర్క్సును సందర్శించి పరిశీలించింది. వాస్తవానికి పేలుడు తర్వాత భవానీ బాణసంచా తయారీ కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. ఇకపై ఈ కేంద్రంలో కూడా బాణసంచా తయారీకి అనుమతి ఇవ్వవద్దని అధికారులు తేల్చిచెప్పారు. కేవలం బాణసంచా విక్రయాలకు మాత్రమే తప్ప తయారీకి అనుమతి లేదని స్పష్టంచేశారు.

విచారణలో.. అనుమతి లేదు!

బాణసంచా పేలుడు ఘటనపై ద్విసభ్య ఉన్నతాధికారులు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్కే. రవికృష్ణ రాయవరం ఎండీడీవో కార్యాలయంలో రెండు గంటలపాటు విచారణ నిర్వహించారు. జిల్లా, డివిజన్ అధికారులను మినహా ఎవరినీ అనుమతించలేదు. విచారణ అనంతరం ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తు వేర్వేరుగా అధికారులను కలసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులతోపాటు ప్రజాసంఘాల ప్రతినిధులను కూడా పిలిపించుకుని వారి గోడును అధికారులు విన్నారు. మృతులు కుటుంబాలకు రూ.50 లక్షల వంతున ఆర్థికసాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.


ఘటనలో కాలిన వస్తువులను పరిశీలిస్తున్న బృందం

త్వరలో బాధితులకు నష్టపరిహారం అందిస్తాం : వేగుళ్ల

రాయవరం బాణసంచాపేలుడు మృతుల కుటుంబాలకు త్వరలోనే నష్టపరిహారం ప్రభుత్వం అందించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. విచారణ కోసం వచ్చిన ద్విసభ్య అధికారులను కలిసి మాట్లాడడం జరిగిందని, బాధితులకు న్యాయం చేసేందుకు వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రాత్రికి రాత్రే హైవేపై లారీల మాయం!


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న రాజానగరం పోలీసులు

రూ.42 లక్షల విలువైన లారీ స్వాధీనం

రాజానగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హైవేపై లారీల చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠాను ఎట్టకేలకు రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా హైవేపై పార్క్ చేసిన లారీలను అపహరించి, రాత్రికి రాత్రే మాయం చేయడమే పనిగా ఎంచుకున్న ఈ ముఠా కోసం పోలీసులు మూడు రాష్ట్రాల్లో గాలించి చివరకు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ నిందితుల వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి నాగేశ్వరరావు హైవేపై గామన్ బ్రిడ్జ్ రోడ్డులో పాలచర్ల పంచాయతీ పరిధిలో ఏఎస్ఆర్ లారీ కాటా పేరున వేబ్రిడ్జ్ నడుపుతున్నాడు. దానిచెంతనే అతడి స్నేహితుడైన మన్యం గణేశ్వరరావు శ్రీకృష్ణా ఇన్ఫ్రా పేరుతో లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు నిర్వహిస్తున్నాడు. వేబ్రిడ్జ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో లారీలను పార్కింగ్ చేస్తుంటారు. గతనెల 24న గణేశ్వరరావు తన బంధువుల వివాహం నిమిత్తం హైదరాబాద్ వెళ్తూ తనకు చెందిన నాలుగు టిప్పర్‌లను సదరు ఖాళీ స్థలంలో పార్క్ చేసి తాళాలు నాగేశ్వరరావు ఆఫీసులో ఇచ్చాడు. 26న ఉదయం వేబ్రిడ్జి వద్దకు వచ్చి చూసేసరికి గణేశ్వరరావుకు చెందిన టిప్పర్లలో ఏపీ 39 డబ్ల్యూ 7729 నెంబరు కలిగిన టిప్పర్ కనిపించలేదు. దీంతో నాగేశ్వరరావు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా ముమ్మర గాలింపు చేపట్టిన పోలీసులు ఈనెల 17న కొవ్వూరు మండలం దొమ్మేరు హైవేపై పొదల్లో లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసులో రాజస్థాన్ రాష్ట్రంలోని దహోటగావ్, ఖోహ్రీ తాలూకా భత్పూర్ జిల్లాకు చెందిన షౌకత్ అలియాస్ షౌకత్ ఖాన్, శేర్పూర్ గావ్, అల్వార్ జిల్లాకు చెందిన జమాల్ ఖాన్, సోహిల్, హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన మహ్మద్ షసిఉద్దీన్‌ను నిందితులుగా నిర్ధారించి అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. చోరీకి గురైన లారీ విలువ రూ.42 లక్షలు ఉంటుందన్నారు. గతంలో వీరిపై 5 కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ ప్రియకుమార్, హెడ్ కానిస్టేబుల్ అమ్మిరాజు, నరేష్ రాజు, సత్య నారాయణ, క్రైం సురేష్, బీవీ రమణను డీఎస్పీ అభినందించారు. కేసు దర్యాప్తు వేగవంతంగా చేపట్టిన డీఎస్పీ,సీఐను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

కాకినాడ ఆర్ఎంసీ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తిని స్వప్రయోజనానికి వాడుకున్నాడన్న ఆరోపణలు రుజువు కావడంతో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఆర్ఎంసీలో జమేదార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేష్‌కుమార్ కళాశాల ప్రాంగణంలోని విలువైన చెట్లను నరికి శానిటేషన్ సూపర్‌వైజర్ కాదా శివయ్య, సెక్యూరిటీ సూపర్‌వైజర్, అలాగే పెస్ట్ కంట్రోల్ వర్కర్ సహకారంతో బయటకు తరలించినట్టు కళాశాల యాజమాన్యానికి ఈ నెల 16న తెలిసింది. అనంతరం ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో దీనిపై అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్‌ను విచారణాధికారిగా నియమించగా జరిగిన విషయం వాస్తవమని నిర్ధారించి నివేదికను ప్రిన్సిపాల్‌కు అందజేసారు. ఈ నేపథ్యంలో సీసీఏ నింబంధనలను అనుసరించి రాజేష్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. రాజేష్‌కుమార్‌కు సహకరించిన శానిటరీ, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించవలసిందిగా సంబంధిత కాంట్రాక్టర్ ఏజన్సీలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అలాగే బయటకు తరలించిన కలపను స్వాధీనం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ స్వాధీనంలో ఉంచామన్నారు.

తక్షణమే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ పెట్టాలి

ఏపీజీఈఏ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తక్షణమే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) తూర్పుగోదావరి జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన 'ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కార వేదికలో' ఏపీజీఈఏ నాయకుల బృందం జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి 12 ప్రధాన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్‌వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా తీసుకుంటున్న చర్యలను తాము స్వాగతిస్తున్నామని, అయితే జిల్లాస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా ఉద్యోగుల స్థానిక సమస్యలు వేగంగా పరిష్కరించవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ నెల్సన్‌పాల్, సహాధ్యక్షుడు ఛార్లీన్, రాజమహేంద్రవరం నగరశాఖ అధ్యక్షుడు జీబీ విజయకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ జీవితానికి ఆధ్యాత్మికతే శరణ్యం



శ్రీ సన్నిధానం దీపావళి పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మనిషి సంపూర్ణ జీవితానికి ఆధ్యాత్మికత మార్గమే శరణ్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక పక్ష పత్రిక శ్రీ సన్నిధానం దీపావళి సంచికను శుక్రవారం సాయంత్రం మంత్రి దుర్గేష్ తన నివాసంలో ఆవిష్కరించారు. రెండు దశాబ్దాలు వీరేశలింగం పాఠశాలలో క్రీడల ఉపాధ్యాయుడిగా పనిచేసిన కాళ్ల రామారావు జీవన కథనాన్ని ప్రత్యేకంగా ప్రజల్లోకి తీసుకెళ్లడాన్ని ఈ సందర్భంగా దుర్గేష్ ప్రస్తావిస్తూ మానవ జీవితంలో ఆటలకు ఎంత ప్రాధాన్యత ఉందో, ఆధ్యాత్మిక రంగానికీ అంతే ప్రాధాన్యం ఉందన్నారు. వీరేశలింగం పాఠశాలలో మరో ఇద్దరు పీఈటీలతో కలిసి పనిచేసిన రామారావు ప్రతీ సంవత్సరం ఇరవైకి పైగా షీల్డులు తీసుకురావడం సామాన్య విషయం కాదన్నారు. వీరేశలింగం ఖ్యాతిని ఇనుమడింపజేయడంలో రామారావు కృషి శ్లాఘనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, గాలి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మూడో ప్రభుత్వ ఉద్యోగులు ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆయన ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కొందరు ఉద్యోగులు సర్వీస్ సమస్యలు, ప్రొబేషన్ డిక్లరేషన్, సీనియారిటీ జాబితాలు, సర్వీస్ రిజిస్టర్ల ధ్రువీకరణ, గౌరవ వేతనం, బీఎల్‌వో వేతనం, రీయింబర్స్‌మెంట్, ఇతర సౌకర్యాల కోసం అర్జీలు పెట్టుకున్నారన్నారు. ఫిర్యాదులను హేతుబద్ధంగా పరిష్కరిస్తామని డీఆర్వో తెలిపారు. ప్రభుత్వాదేశాలతో ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం చూపిన చొరవకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.మాధవరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బాపిరాజు ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామానికి చెందిన ముగ్గురికి వైద్యం అనంతరం మంజూరయిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీరంగపట్నం సొసైటీకి పూర్వ వైభవం తీసుకొస్తా

అధ్యక్షుడు అడపా వీరబాబు

కోరుకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగపట్నం సొసైటీకి పూర్వవైభవాన్ని తీసుకొస్తానని అధ్యక్షుడు అడపా వీరబాబు అన్నారు. మండలంలోని శ్రీరంగపట్నం రైతు వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సభలో వీరబాబు మాట్లాడుతూ రూ.3.33 కోట్ల నష్టాల ఊబిలో కూరుకుపోయిన సొసైటీని అందరి సహకారంతో గాడిలో పెట్టి లాభాల బాట పట్టేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సంస్థాగతంగా ఎన్నో లోపాలు, లోటుపాట్లు ఉన్నాయన్నారు. సొసైటీ పరిధిలోని 6 గ్రామాల రైతులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతో సొసైటీకి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కోయిడాల వెంకటరమణ, దొడ్డి మంగ, సీఈవో కేఎస్‌వీ గణపతి, మల్ల అప్పలనరసారావు, బీజేపీ మండలాధ్యక్షుడు అడపా సుధీర్‌కుమార్, సొసైటీ బ్యాంక్ మేనేజర్ అప్పారావు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలపై భారీ తగ్గింపు



క్రీడా పరికరాల తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సూపర్ సేవింగ్స్ - క్రీడా పరికరాలపై భారీ తగ్గింపు పేరుతో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాపరికరాలు, లేపాక్షి బొమ్మలపై జీఎస్టీ ప్రభావంపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శేషగిరి మాట్లాడుతూ క్రీడా పరికరాలు, దుస్తులు, బూట్లు వంటి వాటిపై జీఎస్టీ 28శాతం నుంచి 12శాతానికి తగ్గించడం వల్ల తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయని అన్నారు. క్రీడాకారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ తిరుపణ్యం మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో సాధనాలు, పరికరాల కొనుగోలు సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో పీడీ కిషోర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి అవతార వైభవంపై బుర్రకథ

రంగంపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి అవతార వైభవంపై జిల్లా వ్యాప్తంగా బుర్రకథలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని శ్రీసత్య సాయిసేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కోటపాడు గ్రామంలో శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి కళావేదికపై గొర్రెల రాము, కృష్ణ, శ్రీనివాసరావు బృందం బుర్రకథను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శ్రీసత్యసాయి బాబా శతవర్ష జయంతి సందర్భంగా బాబా దివ్య లీలలు, అవతార విశిష్టతపై తెలిపేందుకు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబరు 13నుంచి 24వరకు పుట్టపర్తిలో బాబా జయంతి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడికి నిరసన



తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడియం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం కడియంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎల్ఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దళితుడు కావడంతోనే అహంకారంతో ఈ దాడి జరిగిందని, దానిని ప్రజాసామ్యంపై, న్యాయవ్యవస్థపై, రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహశీల్దారు సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మందపల్లి రత్నరాజు, ఈతకోట రాజ్‌కుమార్, యార్లగడ్డ సతీష్, చింతపర్తి నాగేశ్వరరావు, కొడమంచిలి కోటి, చింతపర్తి నాగేశ్వరరావు, పలివెల చినబాబు పాల్గొన్నారు.

గోకవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తు న్నా దళితులపై దాడులు ఇంకనూ జరుగుతూనే ఉన్నాయన్నారు. న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి రాజ్యాంగాన్ని, న్యాయ వ్యవస్థ గౌరవాన్ని కాపాడాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు రామకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండలాధ్యక్షుడు గరబారపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చాపల సూరిబాబు, నాయకులు ములపర్తి నాగేశ్వరరావు, బొడ్డపాటి వీరచంద్ర, మద్దాల శ్రీను, జగ్గారపు చిరంజీవి పాల్గొన్నారు.

లేపాక్షిలో డిస్కౌంట్ మేళా

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పండుగల సందర్భంగా స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న లేపాక్షి ఎంపోరియంలో ఎంపిక చేసిన హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10నుంచి 30శాతం వరకు డిస్కౌంట్ లభిస్తుందని మేనేజర్ జి.మోనిక తెలిపారు. ఈ ఆఫర్ ఈ నెల 17 నుంచి జనవరి 13వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన కమిషనర్ రాహుల్ మీనా



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో మంత్రి దుర్గేష్ నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు మంత్రి అభినందనలు తెలియజేసి, నగరంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా కమిషనర్ రాహుల్‌మీనాను కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ మర్యాద పూర్వకంగా కలిసారు. మొక్కను అందించి అభినందనలు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

గోకవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈదాడిలో రూ.17,000 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ట్రైనీ ఎస్ఐ పి.నాగమణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రంగంపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ, పెయింటింగ్ వర్క్స్ నిమిత్తం ఈ నెల 18న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ టి.శిరీష శుక్రవారం తెలిపారు. ఈ నేపథ్యంలో రంగంపేట టౌన్, రంగంపేట ఇండస్ట్రీ, విజయ విశాఖ, పెదరాయవరం, రామేశ్వరంపేట, వడిశలేరు, నల్లమిల్లి,నాయకంపల్లి, సుభద్రంపేట, దొడ్డిగుంట, వెంకటాపురం,పెదరాయవరం,చంద్రేడు, కోటపాడు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పేర్కొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

సీతానగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైద్యుల న్యాయమైన డిమాండ్లు పీజీ సీట్లులో తమకు తగ్గించిన ఇన్ సర్వీస్ కోటాను పెంచాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రభుత్వాన్ని కోరుతూ వైద్యులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, కె.ఆదిలక్ష్మి, బాబ్జి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్, గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాజవోలు గ్రామంలో డాక్టర్ రవి రామ్‌కిరణ్ సారథ్యంలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నరాలు, కీళ్ల, చర్మ వ్యాధులు, కంటి, దంత సమస్యలు, షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, నిమ్మలపూడి రామకృష్ణ, దుద్దుపూడి రమేష్; బొప్పన నానాజీ, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

రూ.1కే బీఎస్ఎన్ఎల్ సిమ్

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఒక్క రూపాయికే సిమ్ కార్డ్ ఈ ఆఫర్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రవేశపెడుతున్నామని సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు తెలిపారు. రూ.1కే ఉచితంగా సిమ్ కార్డుతో పాటు 30 రోజుల పాటు రోజుకి 2జీబీ డేటా, అపరిమిత కాల్స్ అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విశాఖకు గూగుల్ రాక సాంకేతిక రంగంలో మైలు రాయి

కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ రావడం దేశ సాంకేతిక రంగంలో మైలు రాయి అని శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షా 33 వేల కోట్ల పెట్టుబడులతో గూగుల్ క్లౌడ్‌ను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్ కృషి ఒక చరిత్ర అని కొనియాడారు. దీని వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. నాడు మైక్రోసాఫ్ట్ తీసుకురావడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తే.. నేడు మంత్రి లోకేశ్ కృషి ఫలితంగా విశాఖకు గూగుల్ క్లౌడ్ సెంటర్ వస్తుందని, ఇది శుభపరిణామమని సత్తిబాబు అన్నారు.

సెల్యూలర్ సాంకేతికతపై పట్టు సాధించాలి

సెల్యూలర్ పరిణామంపై వర్క్‌షాపులో నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో 1జీ నుంచి 5జీ వరకూ సెల్యులార్ సాంకేతికత విప్లవాత్మకంగా పరిణామం చెందిందని, విద్యార్థులు దానిపై పట్టుసాధించి సమాజహితంగా ఉపయోగించుకోవాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సెల్యులార్ పరిణామంపై శుక్రవారం వర్క్‌షాపును నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ 1980లో మొబైల్ ఫోన్ జననం నుంచి ఈ రంగంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. ప్రస్తుతం 5జీ కేవలం వేగాన్ని పెంచడం కాదని, ప్రతీ పరిశ్రమను మార్చే చక్కటి పునాదికి సాంకేతికత అని అన్నారు. భవిష్యత్‌కు మార్గదర్శకత్వం 6జీ ఆరిజన్ అని చెప్పారు. రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన తిరుపతి ఐఐటీలోని ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్వేంద్రనాథ్ రిమ్మలపూడి వర్క్‌షాప్ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ పి.వెంకటరత్నం, సహ కన్వీనర్లు బి.సుధాకిరణ్, విజయదుర్గ, కృష్ణ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలక్ట్రికల్ వస్తువుల మెగా ఎక్స్‌పో

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ 2.0 లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ నినాదంతో రాజమహేంద్రవరం త్యాగరాజ భవనంలో శనివారం జీఎస్టీ తగ్గింపును వివరిస్తూ ఎలక్ట్రికల్ వస్తువుల మెగా ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎక్స్‌పో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉంటుందన్నారు. ఇందులో లైట్స్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, వాటర్ హీటర్లు, గీజర్లు, వాషింగ్ మిషన్లు ప్రదర్శిస్తారనితెలిపారు. జీఎస్టీ సేవింగ్స్ ద్వారా రాష్ట్రంలో 8000 కోట్లు వరకు ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తిలక్‌కుమార్ చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీఎస్టీపై అవగాహన పొందాలన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్



చూసిన కనులదే భాగ్యమట!

చూసిన కనులదే భాగ్యమట.. అవును మరి.. ఆ స్వామిని దగ్గర చూసి భక్తజనం పరవశించి పోతున్నారు.. కన్నులారా తిలకించేందుకు భక్తజనం పోటీపడు తున్నారు.. ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చి స్వామిని వేడుకుంటున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు కనులపండువగా సాగాయి. కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వ వాహనంపై భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో విహరించారు.


రేపటి వరకూ జీఎస్టీ షాపింగ్ ఉత్సవ్

జాయింట్ కమిషనర్ సుధాకర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్ ఆదివారం వరకూ నిర్వహిస్తామని స్టేట్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.సుధాకర్ తెలిపారు. ఆనంద్ రీజెన్సి పందిరి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి మాట్లాడారు. ఈ వారాంతంలో ప్రతి ఒక్కరూ షాపింగ్ ఉత్సవ్‌ను సందర్శించి లక్కీడిప్‌లో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ శాఖ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సాయిరామ్, ఆల్కట్ గార్డెన్ అసిస్టెంట్ కమిషనర్ ఏవి శ్రీనివాస్, జీఎస్టీ ఆఫీసర్ హుస్సేన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ 18 మందికి ఫైన్

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో న్యాయస్థానం జరిమానా, జైలు శిక్ష విధించిందన్నారు. 23 కేసుల్లోని 18 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఐదుగురికి ఒక్క రోజు జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ సి.రమ్య తీర్పు ఇచ్చారన్నారు.



క్యాష్ కొట్టు.. లైసెన్స్ పట్టు!

దీపావళి మామూళ్లు

- అవినీతి అధికారులకు దీపావళి
- మామూళ్లు ఇస్తేనే షాపు లైసెన్స్
- జిల్లా వ్యాప్తంగా సాగుతున్న దందా
- బ్రోకర్‌తో నడిపిస్తున్న వ్యవహారం
- 410 దుకాణాలకు దరఖాస్తులు
- ఒక్కో షాపునకు రూ.30 వేలు డిమాండ్
- గగ్గోలు పెడుతున్న తాత్కాలిక వ్యాపారులు

నిడదవోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పండగొచ్చిందంటే అధికారులకు కాసుల పంట పండాల్సిందే.. లేదంటే చేయి ఊరుకోదు..జేబు అసలే ఊరుకోదు..ఏదైనా ప్రభుత్వ పనిచేయాలంటే శాఖల్లో అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కానీ దీపావళి పండుగొచ్చిందంటే మాత్రం ప్రభుత్వ శాఖల అధికారులంతా ఒక్కటై మామూళ్ల మత్తులో తేలుతుంటారు. ఈ దీపావళికి అధికారులు బాణసంచా వ్యాపారుల నుంచి లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. బాణసంచా షాపులు ఏర్పాటుకు రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, జీఎస్టీ ప్రభుత్వ శాఖలు కలిసి తాత్కాలిక బాణసంచా లైసెన్స్ మంజూరు చేయాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 410 దరఖాస్తులు అందాయి.అయితే లైసెన్స్ మంజూరుపై అయోమయం నెలకొంది. ఎందుకంటే షాపుకో రేటు నిర్ణయించారు. ఊరికో ఆసామి (బ్రోకర్) చాలా సింపుల్‌గా ఒక్కో లైసెన్స్ దరఖాస్తు దారుడి నుంచి కొంత సొమ్ము వసూలు చేసి హోల్‌సేల్‌గా రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, జీఎస్టీ ప్రభుత్వ శాఖల అధికారులకు పంచేసి క్షణాల్లో లైసెన్స్ తెచ్చేస్తున్నాడు. ప్రభుత్వ శాఖల అధికారులు సైతం డబ్బు అందగానే నిబంధనల ఊసే మరచి అనుమతులు మంజూరు చేస్తున్నారు. సోమవారమే దీపావళి కావడంతో శనివారం నుంచే షాపులు ఆరంభించాల్సి ఉంది. అయితే శుక్రవారం రాత్రి కూడా కొన్ని షాపుల లైసెన్స్‌లపై అయోమయం నెలకొంది.ఇక షాపులు ఎప్పుడు ఏర్పాటు చేస్తారు.. బాణసంచా విక్రయాలు ఎప్పుడు చేస్తారనేది ఉన్న తాధికారులకెరుక. కొన్ని షాపులకు మాత్రం అధికారులు డబ్బులు పట్టేసి పర్మిషన్లు ఇచ్చారని బాణసంచా వ్యాపారులు కోడై కూస్తున్నారు.ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.ఎందుకంటే 410 షాపులకు అక్షరాలా రూ.కోటిపైనే అందనున్నట్టు అంచనా.

చెల్లించాల్సింది రూ.6 వేలు..

ప్రభుత్వం నుంచి తాత్కాలిక బాణ సంచా షాపు లైసెన్స్‌కు వాస్తవానికి చెల్లించాల్సింది అగ్నిమాపక శాఖకు రూ.500 చలానా, రెవెన్యూ శాఖకు రూ.500 చలానా, జీఎస్టీ శాఖకు రూ.5 వేల అడ్వాన్స్ ట్యాక్స్ మొత్తం రూ.6 వేలు చెల్లిస్తే సరి.

చెల్లించేది రూ.30 వేలు..

రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్, జీఎస్టీ ప్రభుత్వ శాఖలకు ఒక్కో బాణాసంచా దుకాణం నుంచి రూ.30 వేలు చెల్లిస్తున్నారు. నిడదవోలులో 17 బాణసంచా షాపులకు ఒక్కో షాపునకు రూ. 30 వేల చొప్పున రూ.5.10 లక్షలు అధికారులకు అందుతోంది. ఒక్క కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని చాగల్లు, దేవరపల్లి, గోపా లపురం, కొవ్వూరు, నల్లజర్ల, పెరవలి, తాళ్ళపూడి, ఉండ్రాజవరం, నిడదవోలులో ఏర్పాటు చేస్తున్న 111 షాపులకు రూ.33.30 లక్షలు దీపావళి బాణసంచా షాపుల లైసెన్స్ దారుల నుంచి అధికారులకు చేతులు మారాయని వ్యాపారులు వాపోతున్నారు.



కుతుకులూరులో పట్టుబడిన బాణసంచా

వైసీపీ కార్యాలయంలో బాణసంచా సీజ్

అనపర్తి,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం కుతుకులూరు వైసీపీ కార్యాలయం లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టు బడింది. వైసీపీ నాయకుడు, కుతుకులూరు ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి ఇంట్లో వైసీపీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.ఈ కార్యాలయంలో అక్రమంగా బాణసంచా నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు.దీంతో కార్యాలయంలో ఉంచిన బాణసంచా నిల్వలు బయటపడ్డాయి.ఈ మేరకు సీఐ సుమంత్ అక్కడికి చేరుకుని అక్రమ నిల్వలను పరిశీలించారు.ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ బాణసంచా అక్రమ నిల్వలపై సబ్బెళ్ళ నాగిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.బాణసంచా విలువ సుమారు రూ.1 లక్ష వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఎస్ఐ సుజాత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ బాణసంచా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

చాగల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చాగల్లు శివారు చిక్కాలకు వెళ్లే రోడ్డుకు సమీపంలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న కేంద్రంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. రాజమహేంద్రవరం నార్త్‌జోన్ ఏసీపీ, కొవ్వూరు ఇన్‌చార్జి డీఎస్పీ వై.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు మట్టా శివన్నారాయణకు చెందిన జీడిమామిడి తోటలో దాడి చేయగా భారీ ఎత్తున బాణసంచా తయారీకి ఉపయోగించే బొగ్గు, సూరేకారం, గంధకం, తదితర సామగ్రిని మొత్తం 2,525 కేజీలు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆతుకూరి వేణుగోపాలకృష్ణ, మట్టా శివన్నారాయణ, దొనక మురళి, పల్లెల రవికుమార్, కోకనాటి సూరిబాబులను అరెస్టు చేశారు. పందూరి అన్నవరం పరారీలో ఉన్నట్టు తెలిపారు. ముడి సరుకు వివరాలు తెలుసుకుని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గతేడాది కంటే ఎక్కువ ధాన్యం సేకరిస్తాం

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గతేడాది కన్నా 50 లక్షల మెట్రిక్ టన్నుల అధిక ధాన్యాన్ని సేకరించాలన్న లక్ష్యంతో పని చేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం డి.ముప్పవరంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యం సేక రించిన 24 గంటల్లోనే వారి ఖాతాలోకి సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ ఏడాది కూడా తూచ తప్పకుండా ఇదే విధానం అమలు చేస్తామన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జేసీ వై.మేఘ స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత,మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు జీఎస్టీ తగ్గింపుపై విద్యుత్ వస్తువుల ఎక్స్‌పో

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్‌సేవింగ్స్ నినాదంతో రాజమహేంద్రవరం త్యాగరాజ భవనంలో శనివారం జీఎస్టీ తగ్గింపును వివరిస్తూ ఎలక్ట్రికల్ వస్తువుల మెగా ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎక్స్‌పో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉంటుందన్నారు. ఇందులో లైట్స్, ఏసీలు, ఫ్రిడ్జిలు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, వాటర్ హీటర్లు, గీజర్లు, వాషింగ్ మిషన్లు ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లాలో 33 బ్లాక్ స్పాట్‌లు గుర్తింపు

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. పెరవలి, రాజానగరం గామన్ వంతెన, నల్లజర్ల ప్రాంతాల్లో ప్రమాదాల సంఖ్య అధికమన్నారు. రాజానగరం- కాకినాడ ఏడీబీ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 33 బ్లాక్ స్పాట్లు ఉన్నాయని తెలిపారు. వాటి వద్ద లైటింగ్, సైన్ బోర్డులు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమన్నారు. పోలీస్, రవాణా, ఆర్ అండ్‌బీ,రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తక్షణమే తనిఖీలు నిర్వహించి భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. రాజమహేంద్రవరంలో రాత్రి వేళల్లో సరిపడా వెలుతురు లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అవసరమైన చోట్ల వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. హైవేల్లోని డివైడర్ల మధ్య నుంచి అటూఇటూ దాటకుండా ఖాళీలను మూసివేయాలని ఎన్‌హెచ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై పరిమితికి మించిన వేగంతో వెళుతున్న వాహనాల వివరాలను ఎన్‌హెచ్ అథారిటీ వాళ్లు పోలీస్ శాఖకు అంద జేస్తే చలానాలు జారీ చేస్తామన్నారు. నగర రహదారుల్లో అక్రమణల తొలగింపునకు త్వరలో చర్యలు చేపడతామన్నారు.

మాదకద్రవ్యాలపై డయల్ 1972

గంజాయి తదితర నిషేధిత మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో చైతన్యం తేవాలని కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. జిల్లాను పూర్తిగా గంజాయి రహితంగా తీర్చిదిద్దడానికి అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. పోలీస్, ఎక్సయిజ్ అధికారులు తమ పరిధిలోని సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా మంచి ఫలి తాలను సాధించవచ్చని చెప్పారు. ఎస్పీ నరసింహ కిశోర్ మాట్లాడుతూ గత జూన్ నుంచి ఇప్పటి వరకూ జిల్లా పోలీసులు, ఈగల్ టీమ్స్ సుమారు 3500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నా రన్నారు. 93 మంది నిందితులపై 23 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గోకవరం,కోరుకొండ, సీతానగరం ప్రాంతాల్లో గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిపై నిఘా పటిష్టం చేశామన్నారు. జిల్లాలో 22 హాట్‌స్పాట్‌లను గుర్తించి నిరంతరం తనిఖీలు చేసే ఏర్పాట్లు చేశామన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల సమా చారాన్ని 1972 నెంబరుకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, కమిషనర్ రాహుల్ మీనా, డీపీఆర్వో లక్ష్మీ నారాయణ, ఈఎస్ లావణ్య పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షలో కలెక్టర్ కీర్తి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, చిత్రంలో ఎస్పీ, జేసీ, కమిషనర్

చెరువులో మునిగిపోతుంటే.. పోలీసులు రక్షించారు!

ప్రాణాలు కాపాడిన యువకుడి వాట్సప్ స్టేటస్

గోపాలపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ట్రైనింగ్ ఎస్ఐ శివగణేశ్, కానిస్టేబుల్ విజయ్ రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన యువకుడు (22) అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు.కుటుంబకలహాల కారణంగా మనస్తాపానికి గురై క్షణికా వేశంలో చెరుకుమిల్లి గ్రామశివారులో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్యాయ త్నానికి ప్రయత్నించాడు.అయితే ఆ యువకుడు తన వాట్సప్ స్టేటస్‌లో ఆత్మహత్య చేసుకుం టానన్న సందేశాన్ని పోస్టుచేయడంతో గమనించిన అతని మిత్రుడు అనం తపురం నుంచి 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీనిపై స్పందించిన ట్రైనీ ఎస్ఐ శివగణేశ్ తన వెంట విజయ్ అనే కానిస్టేబుల్‌ని తీసుకుని కేవలం 3నిమి షాల్లో సంఘటన స్థలానికి చేరుకుని చెరువులో మునుగుతున్న భానుప్రకాశ్‌ను కాపాడారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

నిడదవోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్ని ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు. నిడదవోలు మండలం కోరుపల్లి సమీపంలో నిడదవోలు నుంచి ఉండ్రాజవరం వైపు వెళుతున్న బైక్.. మునిపల్లి నుంచి నిడదవోలు వెళుతున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మునిపల్లెకు చెందిన అత్తిలి నాగరాజు(40) అక్కడికక్కడే మృతిచెందాడు. రెండు బైక్‌లపై ముగ్గురు ఉండగా ఇద్దరు గాయాలపాలయ్యారు. సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మందుబాబులు సురక్షితం!



- ఏపీ ఎక్సయిజ్ సురక్షా యాప్
- ఇక నకిలీ మద్యానికి చెక్
- క్యూఆర్ కోడ్‌తో బాటిల్ చిట్టా
- నకిలీపై ఫిర్యాదు చేయవచ్చు
- నాణ్యతపై కూటమి ఛాన్స్

స్కాన్ చెయ్.. నకిలీ పట్టేయ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యాన్ని పారించారు. మందుబాబుల జేబులు, ఆరోగ్యాలకు చిల్లు పెట్టారు.అయితే కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని ఆసాంతం మార్చేసింది. నాణ్యమైన సరుకు, బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. ధరలను తగ్గించింది. మందుబాబులకు నిజం తెలియడం ప్రధానమనే ఉద్దేశంతో ప్రభుత్వం సురక్ష ఏపీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ అనే యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మద్యం తయారీ వివరాలు పక్కాగా తెలుసుకోవచ్చు. ఒకవేళ నకిలీ అయితే ఇట్టే పట్టేస్తుంది. ఆపై ఎక్సయిజ్ అధికారులు ఆ తయారీ, విక్రయదారుల పనిపడతారు.యాప్‌పై ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో ..

వైసీపీ ప్రభుత్వం ఎక్సయిజ్ శాఖను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. నాసిరకం మద్యాన్ని ఐదేళ్ల పారించడానికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) అంటూ ఓ కొత్త విభాగాన్ని సృష్టించారు. మద్యం అమ్మకాలు, అక్రమాలపై అసలు నిఘా, తనిఖీలు, చర్యలు లేకుండా చేశారు. నాసిరకం మద్యాన్ని అధిక రేట్లతో తాగించారు. సొంత తయారీ మద్యాన్ని తాగించడానికి బ్రాండెడ్ మద్యాన్ని రాకుండా చేశారు. ఎంసీ వంటి అంతర్జాతీయ కంపెనీలు సైతం రాష్ట్రానికి ఐదేళ్ల రాలేదు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ అన్ని బ్రాండ్లు రాష్ట్రంలో అడుగుపెట్టాయి. ఇప్పుడు నాణ్యమైన సరుకు దొరుకుతున్నా..నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అంటూ వైసీపీ నాయకులు యాగీ చేస్తున్నారు.

ఇప్పుడు సురక్ష యాప్

నకిలీ మద్యం తయారీ, విక్రయాలు లేకపో యినా..ఒకవేళ ఎక్కడైనా చాటుమాటుగా అధికారుల కళ్లుగప్పి చేస్తున్నా వారి పనిపట్టడానికి ఏపీ ఎక్సయిజ్ సురక్ష యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.దీంతో నాణ్యతపై ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. యాప్ ద్వారా సుల భంగా తెలుసుకోవచ్చు.ఎక్కడ, ఏ పరిమా ణంలో, ఏ బ్రాండ్ మద్యం కొనుగోలు చేసినా వినియోగదారుడు ఠక్కున ఆ బాటిల్‌లో మద్యం వివరాలు తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి సురక్ష యాప్ ఏపీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌లో ఉండే క్యూఆర్ కోడ్ స్కానర్‌తో బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే బ్రాండ్ పేరు, లైసెన్స్, తయారీ స్థలం తదితర వివరాలు వస్తాయి. ఒకవేళ మద్యం నకిలీ అయితే చట్టబద్ధ మైన హెచ్చరిక మెసేజ్ వస్తుంది.అలాగే 'డిటెయిల్స్ నాట్ ఫౌండ్' అని వచ్చినా నకిలీ మద్యమనే అర్థం చేసుకోవాలి. యాప్‌లోని సమాచారం రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుంది. వినియోగదారుడు ఎక్సయిజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

కూటమి వచ్చాక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ పిచ్చి బ్రాండ్ల తయారీకి అడ్డుకట్ట వేశారు.తమిళనాడు, కర్నాటక, కేరళ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని మద్యం పాలసీపై ఉన్నతాధికారులతో అధ్యయనం చేయించారు. కమిటీ నివేదిక ఆధారంగా కొత్త పాలసీ వచ్చింది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రైవేటు షాపులు, పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్, ఖాసా డిస్టలరీస్ కంపెనీ, పీరి డిస్టలరీస్ లిమిటెడ్ వంటి కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. నాణ్యమైన బ్రాండ్లు సరసమైన ధరలతో అందుబాటులోకి వచ్చాయి.ప్రస్తుతం 200 వరకూ బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరిలో 400 వరకూ ప్రైవేటు మద్యం దుకా ణాలు, 30 బార్లు ఉన్నాయి. నెలకు రూ.300 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి.

సురక్షా యాప్‌తో సులభంగా



సురక్షా-ఏపీ ఎక్సయిజ్ యాప్‌తో మద్యం నాణ్యత సులభంగా తెలుసుకోవచ్చు.నకిలీ మద్యం తయారీ, విక్రయాలు లేవు. ఎప్ప టికప్పుడు మద్యం దుకాణాలు,బార్లు తనిఖీలు చేసి నమూనాలను ల్యాబ్‌లకు పంపిస్తున్నాం. ఇప్పటి వరకూ నకిలీ ఆనవాళ్లు లభ్యం కాలేదు.నిరంతర నిఘాతో పాటు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. అక్రమ మద్యం, సారా సమాచారాన్ని ఎక్సయిజ్ అధికారులకు చేరవేస్తే వివరాలు గోప్యత పాటిస్తాం.

- లావణ్య, ఎక్సయిజ్ సూపరింటెండెంట్

నూతన నియామకం

కొవ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మద్దుల వీర వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దేవతి భవన్నారాయణ నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ 19న మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో రాష్ట్ర కార్యవర్గం ప్రమాణస్వీకారం జరుగుతుందన్నారు. ఇందులో ఆర్యవైశ్యులు, మహిళా కమిటీలు, యవజన సంఘాల నేతలు పాల్గొనాలన్నారు.

శ్రీరామా సొసైటీలో బాణసంచా విక్రయ కేంద్రం

కొవ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు శ్రీరామా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శనివారం నుంచి దీపావళి బాణసంచా విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కంటమణి రామకృష్ణారావు తెలిపారు. స్టాండర్ట్ కంపెనీ తక్కువ ధరకే విక్రయిస్తోందన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కొవ్వూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు


నిడదవోలులో తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీజే గవాయ్‌పై దాడి దుర్మార్గం

● సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయాలి ● పలుచోట్ల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

కొవూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సీజే బీఆర్ గవాయ్‌పై దాడి దుర్మార్గమని, దీనికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద దళితుల ఆత్మగౌరవ నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు కె.వెంకటేష్, ఎం. దానియేలు, జీ.వినోద్, కే.బాబీ, గెల్లా సురేష్, వరిగేటి కాంతరాజు, కొక్కిరిపాటి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని దళిత ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద వారంతా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తాటిపూడి జగదీష్, గెద్దం రవీంద్ర, నేకూరి ప్రవీణ్, ముప్పిడి తేజ, చాపల గాంధీ, రామచంద్ర, వెంకట్రావు, దిద్దే సాయి కిరణ్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడి ఘటనపై శుక్రవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు నిరసన చేపట్టారు. మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు కొడమంచిలి బాబీ మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు రాకేష్ కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీ లావణ్యకు వినతిపత్రం అందించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెద్దం వినోద్ కుమార్, ముప్పిడి దానియేల్, సిర్రా రాజేంద్రప్రసాద్, కొడమంచిలి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం తహశీల్దార్ ఎం. మెరికమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు మనెల్లి నాని ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలి: సుప్రీంకోర్టు జడ్జి గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద మాదిగ దండోరా సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ లక్కవరపు రాజేష్ మాదిగ, మండల కో కన్వీనర్ శివ, కొండేటి యోహాన్, తెన్నేటి నవీన్, లంకా శామ్యూల్,మానేపల్లి సుధీర్ పాల్గొన్నారు.

దేవరపల్లి: సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాస్‌కు శుక్రవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నేత తాతపూడి సురేశ్, మండల ఎంఆర్‌పీఎస్ సంఘం అధ్యక్షుడు కోడి సూరిబాబు, నాయకులు చాపల శేఖర్, కోడి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో సాగు ఖర్చు తక్కువ

● ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు


రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొవ్వూరు / చాగల్లు, అక్టో బరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో జీవన ఎరువులు వాడకం వల్ల సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చునని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డా.చల్లా వెంకట నరసింహారావు అన్నారు. శుక్రవారం వేములూరు, పశివేదల, చాగల్లు మండలం నెలటూరులో పంటల ఎరువుల యాజమాన్యంలో జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డా.చల్లా వెంకట నరసింహరావు, శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్, ఏవో ఏ.గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల నైరా ప్రొఫెసర్ డా.కె.గురవారెడ్డి, వీఏఏలు హేమంత్, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు, రైతులు గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, తుంపల్లి ఆదినారాయణ, యాలమాటి సత్యనారాయణ, పరిమి గణేష్, ఆలపాటి సాయి, సూదిన శ్రీనివాస్, ఇమ్మని ప్రసాద్, శ్రీనివాస్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు నివేదిత, భాగ్యశ్రీ, జ్యోతిప్రియ, రిషిత పాల్గొన్నారు. నెలటూరులో జరిగిన కార్యక్రమంలో ఏవో కే. వేణుగోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, నైరా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కే. గురవారెడ్డి, అభ్యుదయ రైతులు తాళ్లూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.







విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి : ఛైర్‌పర్సన్

కొవ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పండిత మదనమోహన మాలవ్య మున్సిపల్ హైస్కూల్‌లోని మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీలో కొత్తగా విధుల్లో చేరిన 13 మంది ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం. కె.శ్రీనివాసన్, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

24న తెలుగు వర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్‌గా డీ.మునిరత్నం నాయుడు నియమితులయ్యారు. ఈయన ఈనెల 24వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. చిత్తూరు జిల్లా దిగుమూర్తివారిపల్లెకు చెందిన ఈయన 1987 నుంచి 2017 వరకు ఉమ్మడి తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో, ప్రాచీన తెలుగు కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా పనిచేశారు.ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుకున్న నాయుడు ఈ మేరకు శుక్రవారం విజయవాడలో పెద్దలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీ రామారావు స్థాపించిన వర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావడమే తన కర్తవ్యంగా పనిచేస్తానని తెలిపారు. అలాగే అందర్ని కలుపుకుని వర్సిటీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

మనోజ్‌కు బంగారు పతకం


పతకాన్ని అందజేస్తున్న యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఏపీ జాన్‌ఒలివర్

దేవరపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నాయిగూడెంకి చెందిన ఆచంట మనోజ్ 2021-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రయాగ్‌రాజ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం, సామ్ హిగ్గిన్‌బాటమ్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్, టెక్నాలజీ అండ్ సైన్సెస్ నిర్వహించిన 14వ సనద ప్రదానోత్సవం సందర్భంగా హార్టికల్చర్‌లో ప్రతిభ కనబర్చాడు. ఈ మేరకు ఆయనకు శుక్రవారం స్వర్ణపతకాన్ని ప్రదానం చేశారు. ఈయన తల్లిదండ్రులు ఆచంట గంగాధరరావు, శారదాదేవి. దీంతో పలువురు ప్రజాప్రతినిదులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, తోటి మిత్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకరపర్రు - ఉసులుమర్రు విద్యుత్ ఫీడర్లలో శనివారం మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ నారాయణ అప్పారావు శుక్రవారం తెలిపారు.

'పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట'


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 10 మందికి మంజూరైన రూ.2,98,841 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తోరం నగేష్, ఆకుల నగేష్, జనసేన నేతలు జెట్టి బంగారయ్య, సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ

కొవ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేచర్లలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న మెస్సర్స్ అక్షయ గ్రానైట్స్ అండ్ మెటల్స్‌కు సంబంధించి ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో రాణీసుస్మిత పాల్గొని ప్రజలు, కార్మిక సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను అడిగి తెలుసుకున్నారు. స్వీకరించిన ఫిర్యాదులపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్‌శాఖ ఈఈ శంకరరావు, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంద్రు అనిల్, నాయకులు ముదునూరి సూర్యనారాయణరాజు, గౌరీబాబు, దొనేని మధు, కార్మిక సంఘ నేతలు ఎస్కే మస్తాన్, నాగేశ్వరరావు, కసేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంగిడిలో క్రీడాకారుల ఎంపిక పోటీలు

కొవ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్ 14,17 వాలీబాల్ పోటీలకు బాల, బాలికల ఎంపికలు జరిగాయి. డివిజన్‌లోని తొమ్మిది మండలాల నుంచి మొత్తం 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. డివిజన్ స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని డివిజనల్ కోఆర్డినేటర్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి రామాంజనేయులు, పీ.రవీంద్రనాథ్, హెచ్ఎం ఎం. రామారావు, కే. వెంకటలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.నాగరాజు, వీ.అచ్చయ్య, ఎస్.రవికుమార్, పి.మురళి, బీ.సతీష్, వీ.దుర్గాప్రసాద్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కానూరు సొసైటీలో రూ. 23 లక్షల డివిడెంట్ పంపిణీ

పెరవలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కానూరు విశాల సహకార పరపతి సంఘం గత నాలుగు సంవత్సరాల కాలంలో మెంబర్లకు సుమారు రూ. 23 లక్షల డివిడెంట్ పంపిణీ చేసింది. గత మార్చి నాటికి సంఘంలో 2,234 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. మూలధనం రూ. 82 లక్షలు కాగా, డిపాజిట్లు రూ. పది కోట్లు వరకు ఉన్నాయి. అలాగే 2024-25లో నికర లాభం 58 లక్షల 25 వేలు వచ్చిందని, ఇదే సంవత్సరం మెంబర్లకు ఈ లాభం నుంచి పదిశాతం డివిడెంట్ ఇవ్వడానికి మహాజన సభ ద్వారా తీర్మానించారని అధ్యక్షుడు వాకలపూడి వీర్రాజు, సంఘం సీఈవో బలరామకృష్ణమూర్తి తెలిపారు. శనివారం సొసైటీ వద్ద జరిగే డివిడెంట్ల పంపిణీకి మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వస్తున్నట్టు చెప్పారు.

పట్టాలు ఇచ్చారు ... స్థలాలు మరిచారు

తాళ్లపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో తిరుగుడుమెట్టలో 57 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. కానీ నేటికీ వారికి ఆ స్థలాలకు సంబంధించి అధికారులు పొజిషన్ చూపించలేదు. దీంతో శుక్రవారం ఆ గ్రామానికి చెందిన పలువురు నాయకులు తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వల్లభశెట్టి శ్రీనివాస్, వల్లభశెట్టి చిన్ని, సాలిరాజు, బొంతా సాయి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

గోపాలపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వేలచింతలగూడెంలో తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ ఛైర్మన్ మడపర్తి రామ్మోహనరావు నివాసం వద్ద విలేఖర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టబోతున్న దేశ వ్యాప్త ఉద్యమ సంతకాల సేకరణకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరిబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు యండవల్లి శ్రీరామన్నారాయణ ప్రసాద్, డీసీసీ ఉపాధ్యక్షుడు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా వైస్ ఛైర్మన్ కాటూరి అమ్మినీడి చౌదరి, పర్వతనేని వీరవెంకట సత్యనారాయణ, దాసరి కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

